# లవ్ యీజ్ బ్లైండ్:

ఇమ్మానేని నాగేంద్రరావు.

ప్రేమగుడ్డిది అంటారు. నేను దాన్ని చాలా రోజులు నమ్మేవాడినిగాను, మీరు కూడా నమ్మరనే నావుద్దేశం కాని నాకు తెలిసిన ఒక సంగతి మనవిచేస్తా.

నేను ఇంటర్ ప్యాసవంగానే మెడికల్‌కు వెళ్లినా ఏమీ లాభం లేదని (ఇప్పటిడాక్టర్లకు బోర్డు వ్రాయించనూ, నూట్లుకుట్టించనూ తగలేసిన బత్తాలయినా గిట్టటంలేదు కదండీ మరి) ఆనర్సు చదువుదామని మద్రాసు వెళ్ళాను, "లయోలా" కాలేజీహాస్టలులో చేరాను. నారూమ్‌మేటు గోపాలరావు అతను రాజమండ్రినుంచి వచ్చాడు. చాలా అల్లరిచేసేవాడు క్లాసులో గూడా, వాడు ఏమీ ఆటలు ఆడేవాడు కాదు. రోజూ సాయంత్రమయే టప్పటికి ముస్తాబవడములో శ్రావణమంగళవారపు ముత్తైదువచేసినంత హడావడిచేసి ఏ "బీచ్"కో ఏ "క్వీన్స్‌మేరీ" కాలేజీ వైపో వెళ్ళేవాడు. అక్కడికి సాయంత్రమయే టప్పటికే చేరి మోపాట వినటానికైతేనేం మరెందుకైతేనేం అన్నిరకాల మనుష్యులూ చేరుకోవటం మామూలు కాదండీ! వారినందరినీ చూచైనా ఆనందిద్దామని మనవాని వుద్దేశమై వుంటుంది.

మాకు క్రిస్టమస్ సెలవలు యిచ్చారు. కాని పరీక్షలు సెలవలయిన తరువాత పెట్టారు. అందువల్ల మేమంతా స్వగ్రామాలకు వెళ్తే చదువు సాగదని చెప్పి అక్కడే వుండిపోవలసి వచ్చింది. సెలవు లిచ్చినరోజు సాయంత్రం గోపాలరావు తెల్లసూటువేశాడు, స్నోగొట్టాకు మఖానికి, సెంటు రాశాడు, కళ్ళద్దాలు తగిలించాడు, ఈవినింగ్‌హాటొకటి పెట్టాడు, ప్లెక్సుబూటేసి, సిగరెట్ వెలిగిస్తూ బయలుదేరాడు. ఇంతలో పోస్టు ప్యూనువచ్చి మనియార్డరు వచ్చినదని చెప్పి గోపాలరావు కిచ్చాడు. ఆడబ్బు కోటుజేబులో వేసుకొని బయల్దేరాడు బీచికి యథాప్రకారం, కాలేజీలన్నీ మూసివెయ్యడంవల్ల రావలసిన వారెవరూ రాలేదక్కడికి, మనవానికేమి తోయ్యక అక్కడా, యిక్కడా కొంచంసేపు పచార్లుచేసి సెంట్రల్ స్టేషన్‌కు చేరుకున్నా డారుగంటలకల్లా.

కలకత్తామెయిల్‌కి టయిమయింది. ప్లాటుఫారమంతా జనం హడావడిగావున్నారు. గోపాలరావు పచార్లుచేస్తున్నాడటూ యిటూ, ప్లాటుఫారంమీద ఒకచోటుం దొకగుమ్మైన గుంటచేతిలో "సంజాణ"ను పట్టుకొని అబర్నామండీ, ఆకోకకట్టూ, ఆరోల్డుగోల్డు కళ్ళజోళ్ళూ, కాళ్ళకు ఆముఖమల్ స్లిప్పర్సూ, ఆబుగ్గమీద ఎరుపూ, విశాలమైన నుదురూ, ఎఱ్ఱని పెదిమెలూ ఆమెకు లేని సౌందర్యం తెచ్చి పెడ్తూవున్నాయి, ఆతళుకు ఆబెళుకూ చూచి ఆప్లాటుఫారం మీద జనమంతా అటువైపు చూడడమే. చూడడమూ మరి (సహజమే) మనగోపాలరావు కూడా చూపులు విసిరాడా వైపు, రెటర్ను కూడా వచ్చాయి, అక్కడే అటూ యిటూ పచార్లుచేస్తూవున్నాడు.

ఇంతలో మెయిల్ వచ్చి ఆగింది స్టేషన్‌లో, ఆఅమ్మాయి గోపాలరావును చూచి నాకు "వైజాగ్"కు ఒకటిక్కట్ తీసుకొని వస్తారూ కొంచెం. మావాను వస్తానని రాలేదు అని పెట్టి తియ్యను వంగబోయింది. మనగోపాలుడు గుమ్మైపోయాడు పర్వాలేదు. తరువాత యివ్వవచ్చును లెండి అని చెప్పి గబగబా బుకింగ్ ఆఫీసులోనికి వెళ్ళి "వైజాగ్"కి రెండు ఫస్టుక్లాసు టిక్కెట్లు తీసుకొనివచ్చి కూలీలను పిలచి చిన్న

ఇంటర్ క్లాసు పెట్టెలో పెట్టించాను సామానులను, ఆఅమ్మాయి అతివయ్యారంగా నడుస్తూ వచ్చెక్కింది బండి, గోపాలరావు కూడా అందులోనే యింకొకవైపు కూర్చున్నాడు. బండి కదిలింది. మీరెంత దాకా వెళ్తున్నారనని అడిగిందాచిన్నది. బహుమృదువుగా.

నేనూ వైజాగ్ కే వస్తున్నాను.

మీ పేరు.

పేరు గోపాలరావు నేనిక్కడ ఆనర్సుక్లాసులో చదువుతున్నాను. అని మీ పేరేమిటని అడిగాడు.

నాపేరు కమల నేను బి. ఎ. జూనియర్ చదువుతున్నాను కాలేజీలో అందా అమ్మాయి.

అయితే మదాసులో మన మప్పుడప్పుడూ కలుసుకొంటూ వుండవచ్చును.

కమల "మంచిది" అన్నదొక చిన్నమందహాసము చేసి.

తరువాత ఆమెచేతిలోని "నెరజాణ"ను తీసికొని చదివి చాలా బాగుందన్నాడు గోపాలరావు.

ఇప్పుడు వచ్చే మాసపత్రిక లన్నిటిలో యిదే బాగుంటుందన్నది కమల.

తరువాత ఒక స్టేషన్ లో టిఫిన్ తీసుకొనివచ్చి తినమని చాలా బలవంతం చేసాడు. కొంచం సేపు బాతాఖానీ కొట్టారిద్దరూను, మాట్లాడుతూవుండంగానే నిద్రాదేవత ఆహ్వానించింది. మన గోపాలుణ్ణి. ప్రొద్దుననే 5 గంటలప్పుడు మెలకువవచ్చి కమలవున్నదో లేదో నని హడావడిగా లేసి చూచాడు. ఎదుటసీటులో ఒక నవనాగరిక యువకుడు, సిగరెట్ కాలుస్తూ హిందూపేపరు చదువుతూ కూర్చొనివున్నాడు. మనవాడా పెట్టెలో అతనిని చూచి కంగారయిపోయి బండిది ప్రతి పెట్టావెతికాడు కమలకోసరం, కాని ఆమె జాడెక్కడా కనబడలేదు. ఇదంతా చూచి ఎదుటసీటులో నున్న యువకుడు ఒకచిరునవ్వు నవ్వాడు దానికర్థమేమిటో.

గోపాలరావు బెజవాడస్టేషన్ లో దిగి తరువాత బండిలో మదాసుకుచేరుకున్నాడు. బండి దిగంగానే గబగబా హాస్టలుకి వచ్చాడు, కమలను నిందిస్తూ. ఏమిరా నిన్నంతా ఎక్కడవున్నావు. ఇట్లా తెల్లముఖంవేసావేం అంటే సంగతంతా చెప్పి ఎవ్వరితోను చెప్పవద్దని బతిమాలాడు బహుదీనంగా.

మరునాడు నాకు వైజాగ్ నుంచి ఒక జాబు వచ్చింది. మొన్నస్టేషలో మాగోపాలునికి టోపీ వేసిన కమల నిజంగా "లేడి" కాదు. అతనిపేరు కమలాకరరావు, బి. ఎ. జూనియర్ చదువుతూన్నాడు. చాలా బీదవాడు, అతడు డ్రామాలలో అప్పుడప్పుడు ఆడవేషములు వేసి డబ్బుగణిస్తూ వుంటాడు కూడాను. ఒకసారి మా కాలేజివార్షికోత్సవదినమున చింతామణి వేషంవేసి అందరిని మెప్పించాడు. గోపాలరావు కూడా వచ్చి చూశాడప్పుడు కమలాకరరావు తన స్వగ్రామం వెళ్దామనుకొన్నాడు. కాని డబ్బులేకపోయింది పాపం. నరేనని అసలైన "సినీమాస్టార్" లాగ తయారయాడు, స్టేషన్ లో మన గోపాలుడిలాటివాళ్లెవరైనా దొరికితే సరి లేకపోతే మళ్ళీ రూమ్ కి వచ్చేద్దామనుకున్నాడు. అతనను కొన్నట్లు జరిగింది. వైజాగ్ కిచేరుకున్నాడు. మన గోపాలరావు మటుకూ అనవసరంగా తన డబ్బు చాలా ఖర్చుఅయినందుకు విచారిస్తూకూర్చున్నాడు.

ఇప్పటికైనా లవ్ యీజ్ బ్లెయిండ్ అని ఒప్పుకుంటారా ? ఒప్పుకుంటారని నా అభిప్రాయం! సెలవు తీసుకొంటా.